సాక్షి
నిర్మల్

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024

నాగోబా జాతర షురూ

మెస్రం వంశీయుల మహాపూజతో కేస్లాపూర్‌లో నాగోబా జాతర ప్రారంభమైంది. కొత్త కోడళ్లు గోవడ్ వద్ద శనివారం తమ దేవతలకు నైవేద్యాలు సమర్పించి ఉపవాస దీక్ష విరమించారు. ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నాగోబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



- వివరాలు 8లో

న్యూస్‌రీల్

పోలీస్ కాదు.. కలెక్టరే



పోలీస్ యూనిఫామ్‌లో విభిన్నంగా కలెక్టర్

నిర్మల్‌ఖిల్లా: కలెక్టర్ అంటేనే సమీక్షలు, అధికారులతో సమావేశాలు, సంక్షేమ పథకాల అమలు తనిఖీలు, పర్యటనలు ఇలా రోజంతా బిజీబిజీ షెడ్యూల్‌తో గడుపుతూ ఉంటారు. అయితే నిర్మల్ కలెక్టర్ శనివారం స్పెషల్‌గా కనిపించారు. నిత్యం ఫార్మల్ డ్రెస్‌లో కనిపించే ఆశిష్ సంగ్వాన్ పోలీస్ యూనిఫాంలో దర్శనం ఇచ్చారు. మామడ మండలంలో పోలీస్ శాఖ నిర్వహించిన ఫైరింగ్ కార్యక్రమానికి కలెక్టర్ పోలీస్ యూనిఫామ్‌లో హాజరయ్యారు. అక్క డి నుంచి నేరుగా అదేడ్రెస్‌లో లక్ష్మణచందా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఆకస్మికంగా కలెక్టర్ పాఠశాలకు రావడంతో అక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులు పోలీస్ అధికారి వచ్చారని భావించారు. పోలీస్ కాదు.. కలెక్టరే అని తెలిసి నివ్వెరపోయారు.

జిల్లాస్థాయి కబడ్డీ సెలక్షన్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుటున్న నేతలు

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శనివారం జిల్లాస్థాయి కబడ్డీ సెలక్షన్ పోటీలు నిర్వహించారు. పి.సుదర్శన్‌రెడ్డి స్మారక మెమోరియల్, జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200(75 మంది బాలికలు, 125 మంది బాలురు) మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులపై హర్షం

ఖానాపూర్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో విద్యారంగానికి కేటాయింపులు గతం కంటే పెరగడంతో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యతోపాటు ఉన్నత విద్య, సాంకేతిక విద్యకు కేటాయింపుల్లో ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం హర్షనీయమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ అన్నారు. విద్యారంగానికి కేటాయింపులు పెరిగినప్పటికీ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా 15శాతం కేటాయించలేకపోయారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడాన్ని స్వాగతించారు.

1 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్స్

నిర్మల్ రూరల్: పదవ తరగతి విద్యార్థులకు మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఉన్నందున, 10వ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం నిర్వహించనున్నారు. మార్చి 1న తెలుగు, 2న హిందీ, 4న ఇంగ్లిష్, 5న గణితం, 6న భౌతిక శాస్త్రం, 7న జీవశాస్త్రం, 11న సాంఘిక శాస్త్ర పరీక్షలను నిర్వహిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 18 నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి.

రెవెన్యూలో భారీగా బదిలీలు

భైంసాటౌన్: డిప్యూటీ, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లతోపాటు రెవెన్యూశాఖలో పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేసింది. నిర్మల్ జిల్లా ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వి.లోకేశ్వర్‌రావును ఆసిఫాబాద్ ఆర్డీవోగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో సిరిసిల్ల ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య నిర్మల్‌కు రానున్నారు. లక్ష్మణచాంద, దిలావర్‌పూర్ తహసీల్దార్లు కె.శ్రీలత, డి.సరితలతోపాటు కలెక్టరేట్ సూపరింటెండెంట్లు ఆర్.శ్రీనివాస్, సీహెచ్.సత్యనారాయణ, కె.గజానన్, డి.కిరణ్మయిని బదిలీ చేయగా, ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయ డీఏవో బి.స్వాతి, జగిత్యాల కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.విజయలక్ష్మి, కామారెడ్డి కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.సాయి భుజంగరావు, కామారెడ్డి జిల్లా లింగంపేట తహసీల్దార్ జి.సుధాకర్, గాంధారి తహసీల్దార్ కె.జానకి, బోధన్ ఆర్డీవో కార్యాలయ డీఏవో పి.విఠల్ నిర్మల్‌కు బదిలీపై రానున్నారు. ఇక, జూన్‌లోగా ఉద్యోగ విరమణ పొందనున్న ఖానాపూర్ తహసీల్దార్ పరిమల్ భూమిక్, దస్తురాబాద్ తహసీల్దార్ మహ్మద్ జాకీర్, ముథోల్ తహసీల్దార్ ఎండీ.అతీక్‌ఉద్దీన్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బడ్జెట్.. భరోసా



- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- ప్రతీ ఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- అర్హులకే రైతుభరోసా.. కౌలురైతులకూ హామీ
- జిల్లాలో టెంపుల్ టూరిజానికి ఛాన్స్
- భరోసా ఇచ్చేలా ఓటాన్ అకౌంట్ బడ్జెట్

నిర్మల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలకు భరోసా ఇచ్చేలా సాగింది. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన ప్రతిఇంటికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుకు నిధులు కేటాయించింది. రైతు రుణమాఫీ, రైతుభరోసా పథకాలకు కట్టుబడి ఉంటామని చెప్పినా.. నిధుల విడుదలను వెల్లడించలేదు. రైతులతోపాటు కౌలురైతులకూ రైతుభరోసా ఇస్తామని ప్రకటించింది. రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క శనివారం అసెంబ్లీలో తొలిసారి ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి రావాల్సిన కేటాయింపులపై స్పష్టత వచ్చిన తర్వాతే పూర్తిస్థాయి పద్దును ప్రకటిస్తామని చెప్పారు. ఈ బడ్జెట్‌లో నేరుగా జిల్లాకు నిధులు కేటాయించకున్నా.. ఆయా శాఖల ప్రకారం జిల్లాకు పలురంగాలకు లబ్ధి చేకూరనుంది.

జిల్లాకు 10,500 ఇళ్లు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పినట్లే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేపట్టింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లను ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఈలెక్కన జిల్లాకు 10,500 ఇళ్లు రానున్నాయి.

200 యూనిట్ల కరెంటు ఫ్రీ..

ఆరు గ్యారంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం హామీని ఈ బడ్జెట్ నుంచి అమలులోకి తీసుకువస్తోంది. గృహజ్యోతి పథకం పేరిట సత్వర అమలుకు రూ.2,418 కోట్లను ఆర్థికమంత్రి కేటాయించారు. జిల్లాలో 1,94,000 గృహవిద్యుత్ (డొమెస్టిక్) వినియోగ మీటర్లు ఉన్నాయి. అర్హులైన వారిని గుర్తించే సర్వే ఇప్పటికే కొనసాగుతోంది.

ఇరిగేషన్‌కు ఇస్తారా..!

రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదలశాఖకు పెద్దమొత్తంలో నిధులను కేటాయించింది. రూ.28,024 కోట్లు కేటాయిస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. జిల్లాలో నిధుల కోసం ఎదురుచూస్తున్న కడెం, సదర్‌మట్, స్వర్ణ తదితర ప్రాజెక్టులకు ఎంత ఇస్తారనేది తేలాల్సి ఉంది. ప్రధానంగా కాళేశ్వరం పథకం కింద చేపట్టిన ప్యాకేజీ 27, 28, భైంసా మండలంలో కొట్టుకుపోయిన సిరాల ప్రాజెక్టు, కడెం మండలంలో లక్ష్మీపూర్ ఎత్తిపోతల పథకం నిర్మాణం, సారంగాపూర్ మండలంలో దోనిగాం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులను కేటాయించాలని జిల్లా ఎమ్మెల్యేలు కోరారు.

పర్యాటకాభివృద్ధికి అవకాశం..

రాష్ట్రవ్యాప్తంగా పర్యాటకాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రధానంగా 'టెంపుల్ టూరిజం సర్క్యూట్'లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలోని బాసర జ్ఞానసరస్వతీ ఆలయం కేంద్రంగా పలు ప్రాంతాల పర్యాటకాభివృద్ధికి అవకాశం ఉన్నట్లూ వెల్లడించారు. ఐటీ సంస్థలను పర్యాటకంగా అటవీ ప్రాంతాల వరకు తీసుకువచ్చే టూరిజం ప్రణాళికలనూ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇదే జరిగితే బాసరతోపాటు జిల్లాలోని చారిత్రక ప్రాశస్త్యం గలది. బ్రహ్మేశ్వర్ ఆలయాలతోపాటు కడెం ప్రాజెక్టు, మహబూబ్‌ఘాట్స్, నిర్మల్ కొయ్యబొమ్మలకు మంచిరోజులు వస్తాయి.

వివిధ రంగాలకూ..

- రైతుభరోసా, రుణమాఫీలపై మాత్రం ఇందులో కేటాయించకుండా వాటిపై భరోసా మాత్రం ఇచ్చింది. మొత్తం వ్యవసాయరంగానికి 19,746కోట్లను కేటాయించింది.
- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ పబ్లిక్‌స్కూళ్లను పైలట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేయనుంది. ఇందుకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించారు.
- సొంతింటి కల నిర్మాణంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి గానూ రూ.5 లక్షల ఆర్థికసాయం అందించే విషయంపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.
- పంచాయతీరాజ్, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి శాఖల కోసం రూ.40,080 కోట్లు కేటాయించారు. ఇందులో వరదలతో దెబ్బతిన్న జిల్లాకు పెద్దమొత్తంలో కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉంది.
- జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు నిధుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ జిల్లాకేంద్రంలో చాలాపనులు సగంలోనే నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. బడ్జెట్‌లో పురపాలక శాఖకు రూ.11,692 కోట్లను కేటాయించగా, ఇందులో జిల్లాకు ఎక్కువ నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారు.

గ్యారంటీల బడ్జెట్..



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం, కేంద్ర నిధుల స్పష్టత రాని కారణంగా రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టింది. ఇందులో ప్రధానంగా తమ గ్యారంటీలను అమలు చేసేదిశగా నిధుల కేటాయింపులు ఉన్నాయి. పరిశ్రమలకు రూ.2,543 కోట్లు, ఐటీకి రూ.774కోట్లు కేటాయించారు. మొత్తానికి తమ హామీల అమలుకు ప్రయత్నం చేసింది.

– మెట్‌పల్లి సురేశ్, టాక్స్‌కన్సల్టెంట్, నిర్మల్

పబ్లిక్‌స్కూల్స్ హర్షనీయం..



తెలంగాణ పబ్లిక్‌స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించడం హర్షనీయం. యూనివర్సిటీలను పరిగణనలోకి తీసుకుని నిధులు కేటాయించడం శుభపరిణామం. డీఎస్సీ నిర్వహణ, కొత్తపోస్టులు, పాత సమస్యల పరిష్కారాలు చేపట్టాలి.

–భూమన్నయాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

విద్యారంగానికి ప్రాధాన్యం..

రాష్ట్రప్రభుత్వం ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి గతానికంటే కాస్త ఎక్కువే నిధులు కేటాయించింది. గత బడ్జెట్‌లో 6.7 శాతం ఇవ్వగా, ఈసారి 7.75 శాతం కేటాయించారు. అన్నిపాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, మౌళికవసతుల కల్పనకు హామీ ఇచ్చారు. గురుకులాలకు సొంత భవనాలు ప్రకటించారు.

– దాసరి శంకర్, పెంటా అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రైతులు, నిరుద్యోగులకు మొండి చేయి



నిర్మల్‌టౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో రైతులకు, నిరుద్యోగులకు కాంగ్రెస్ సర్కార్ మొండిచేయి చూపిందని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందనీ, వ్యవసాయ రంగానికి కేవలం రూ.19,746 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఏడాదికి 15 వేల రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, 24 గంటల ఉచిత కరెంట్, పంటల బీమా, పంటలకు 500 బోనస్ అన్నింటికి ఈ నిధులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, గ్యారంటీలు బారెడు ఉన్నాయని, కేటాయించిన నిధులు మూరెడే ఉన్నాయనీ ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు.

– బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి

పట్టుబట్టి.. కొలువు కొట్టి..

- గ్రూప్ 4 ఫలితాల్లో జిల్లా వాసుల ప్రతిభ



కత్రోజు విజయ్



యెల్మల శ్రీనివాస్

నిర్మల్‌ఖిల్లా: కలలు కన్నారు. ఆ కలల్ని నిజం చేసుకోవడానికి అహర్నిశలు శ్రమించారు. ఇరుకు గదుల్లో, గ్రంథాలయాల్లో, కోచింగ్ సెంటర్లలో కుర్చీలకు అతుక్కుపోయారు. పుస్తకాల పేజీలు రోజుల తరబడి, గంటలకొద్దీ తిప్పారు. జిల్లా యూనిట్‌గా నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షల్లో పట్టు పట్టి తమ లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం అనే కలను నిజం చేసుకున్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో జిల్లాకు చెందిన యువకులు సర్కారు కొలువులు గెలుచుకున్నారు.

గ్రూప్ 4లో జిల్లాఫస్టు

గ్రూప్ 4 ఫలితాల్లో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కత్రోజు విజయ్ రాష్ట్రస్థాయిలో 73వ ర్యాంకు సాధించాడు. జిల్లాస్థాయిలో మొదటిస్థానాన్ని పొందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి ప్రభుత్వ ఉద్యోగం పొందాలనే తపనతో రెండేళ్లుగా సివిల్స్, గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. జేఎన్టీయు విశ్వ విద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. పదో తరగతి వరకు నిర్మల్‌లో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో చదివాడు. ఇతని తండ్రి శ్రీనివాస్ మామడ మండలంలోని గోండుగూడ పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తన లక్ష్యం గ్రూప్ వన్ ఉద్యోగం సాధించడమేనని విజయ్ 'సాక్షి'కి తెలిపాడు.

ఐదేళ్లుగా శ్రమిస్తూ...

జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన యెల్మల శ్రీనివాస్ ఐదేళ్లుగా గ్రంథాలయానికి అంకితమై పుస్తకాలతో కుస్తీపట్టాడు. పీజీ, బీఈడీ పూర్తి చేసిన శ్రీనివాస్ ఉద్యోగ పోటీ పరీక్షలకు దరఖాస్తులు చేసుకుంటూనే తన ప్రిపరేషన్ కొనసాగించాడు. గ్రూప్ 1, గ్రూప్ 2 వంటి పరీక్షలకు సన్నద్ధమవుతోనే గ్రూప్ 4 పరీక్షను కూడా రాశాడు. ఇందులో నిర్మల్ జిల్లా స్థాయిలో 50వ స్థానాన్ని, బీసీ–ఏ కేటగిరీలో 4వ స్థానం కైవసం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాడు. 1 నుంచి ఐదో తరగతి వరకు స్థానిక శిశుమందిర్‌లో, 6 నుంచి ఇంటర్ వరకు ముథోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, డిగ్రీ నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాలలో, పీజీ హైదరాబాద్‌లో చదివాడు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నుంచి గ్రూప్స్‌కు



దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన కాలేరి మధు గ్రూప్ 4 ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. నాలుగేళ్ల క్రితం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాడు. విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. గ్రూప్ 4లో రాష్ట్రస్థాయిలో 1,260వ ర్యాంకు, జిల్లా స్థాయిలో 24వ ర్యాంకు సాధించాడు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ నాలుగేళ్లుగా బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు తెలిపాడు. మరిన్ని ఉద్యోగాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

– కాలేరి మధు, దిలావర్‌పూర్

అమ్మానాన్న ఆశయాలను నెరవేరుస్తా...



అమ్మానాన్న తాటి శోభ – మహేశ్వర్ నన్ను కష్టపడి చదివించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. ఇటీవల వెలువడిన గ్రూప్ 4 ఫలితాల్లో 541 ర్యాంకు సాధించాను. అమ్మానాన్న ఆశయం నెరవేరుస్తా.

– తాటి సాయి తేజ

రెండు ఉద్యోగాలకు రాజీనామాచేసి..



మా అమ్మ లక్ష్మి విశారద ఐసీడీఎస్ సూపర్‌వైజర్. నాన్న చంద్ర ప్రకాశ్ కష్టపడి నన్ను చదివించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి, ఎఫ్‌బీవో ఉద్యోగాలు సాధించా. వాటికి రాజీనామా చేసిన. కరోనా పరిస్థితుల్లో పట్టుదలతో గ్రూప్ ఫలితాల్లో 3,249 ర్యాంకు సాధించాను.

– చేపూరి వినయ్ బాబు

పరీక్షలంటే భయం వీడాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

లక్ష్మణచాంద: పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయం వీడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక పరీక్షను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్టుల్లో అర్థం కాని అంశాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి మరోమారు చెప్పించుకోవాలని, సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన వంట గదిని పరిశీలించి నిర్వహణ గురించి ప్రధానోపాధ్యాయుడు అశోక్ వర్మను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు మనబడిలో భాగంగా నిర్మించిన పాఠశాల డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పదో తరగతి గదిలోని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ విద్యా బోధనలో పనితీరు, ఉపయోగం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్, ప్రధానోపాధ్యాయులు ఆర్.అశోక్ వర్మ, సీఆర్పీ సుధాకర్ ఉన్నారు.



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తలాపునే గోదావరి.. చేను, చెల్క ఎడారి!



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు ముత్తన్న. మండలంలోని పీచర గ్రామానికి చెందిన ఇతను ఎస్సారెస్పీ ఉప కాలువ డీ15 కింద 5 ఎకరాల్లో యాసంగిలో వరి వేశాడు. కాలువకు వారం రోజులుగా నీళ్లు రాకపోవడంతో పంట ఎండిపోతోంది. కళ్ల ముందే ఎండుతున్న పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నాడు. ఉప కాలువ కింద ఉన్న 2 వేల ఎకరాల ఆయకట్టు రైతులందరి పరిస్థితి ఇదే.



నిండుగా పారుతున్న సరస్వతి కాలువ



చుక్క నీరు లేని డీ 15 కాలువ

- పని చేయని డీ15 కాలువ తూము గేటు
- నీటి విడుదలకు అంతరాయం
- 2 వేల ఎకరాల ఆయకట్టుకు అందని నీరు
- ఎండుతున్న పంటలు

లక్ష్మణచాంద: ''తలాపున పారుతుంది గోదారి నీ చేను నీ చెలకా ఎడారి, రైతన్నా, నీ బతుకు అమాసా..'' అంటూ కవి సదాశివుడు తెలంగాణ ఉద్యమ సమయంలో రైతులకు సాగునీరు అందని వైనాన్ని కళ్లకు కట్టేలా రాశాడు. తెలంగాణ ప్రాంతంపై పాలకులు చూపుతున్న వివక్షపై డమరుక ధ్వని మోగించారు. లక్ష్మణచాంద మండలం పీరచ, సోమన్ మండలం న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల రైతుల పరిస్థితి కూడా సదాశివుడి పాటను గుర్తు చేస్తోంది. జిల్లా రైతాంగానికి వరప్రదాయిని ఎస్సారెస్పీ సరస్వతి కాలువ. మండలంలోని పీచర, ధర్మారం, మల్లాపూర్, పార్‌పెల్లి, సోన్ మండలం న్యూవెల్మల్, బొప్పారం గ్రామాలకు సరస్వతి కాలువ ఉప కాలువ డీ15 ద్వారా ఏల్లుగా సాగునీరు అందుతోంది. ఈ కాలువకు కొన్ని రోజులుగా నీళ్లు రావడం లేదు. సరస్వతి కాలువ గోదవరి జలాలతో నిండుగా పారుతున్న డీ15 కాలువ మాత్రం నీరులేక వెలవెలబోతోంది. దీంతో యాసంగి పంటలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

2 వేల ఎకరాల ఆయకట్టు..

డీ15 కాలువ కింద లక్ష్మణచాంద, సోన్ మండలాల్లో సుమారుగా 2 వేల ఎకరాల ఆయకుట్టు ఉంది. సరస్వతి కాలువ నుంచి ఉప కాలువకు నీరు విడుదల చేసే తూము గేటు కొన్ని రోజుల క్రితం విరిగింది. దీంతో గేటును ఎత్తడం వీలుకావడం లేదు. లస్కర్లు ఏమీ చేయలేని పరిస్థితి. సమస్య పరిష్కరించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఆయకట్టులో సాగు చేసిన పంటలు బీళ్లుగా మారుతున్నాయి. సరస్వతీ కాలువకు నీళ్లు వస్తున్న తమ పంటలకు మళ్లించుకోలేకపోతున్నామని పీచర, ధర్మారం, మల్లాపూర్, మాచాపూర్, పార్‌పెల్లి, న్యూవెల్మల్, బొప్పారం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

మరమ్మతు చేస్తేనే..

డీ15 ఉప కాలువ తూము గేటుకు వీలైనంత త్వరగా మరమ్మతులు చేస్తేనే ఆయకుట్టు పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పటికే వారం రోజులుగా నీళ్లు రావడం లేదని పేర్కొంటున్నారు. ఎండలు ముదురుతున్నందున అధికారులు త్వరగా స్పందించి గేటుకు మరమ్మతు చేయాలని కోరారుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



మండలంలోని డీ15 కాలువ గేటు పనిచేయక పంటలకు నీళ్లు రావడం లేదు. ఎండిపోతున్నాయి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– బుర్రి దేవన్న, రైతు పీచర

చర్యలు చేపడుతాం


డీ15 ఉప కాలువ తూము గేటు పాడైన విషయం మా దృష్టికి వచ్చింది. మరమ్మతుల ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

– మధుకర్, ఏఈ ఇరిగేషన్

ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించాలి

నిర్మల్ రూరల్: ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి, పాఠశాల పర్యవేక్షణాధికారి పోస్టులకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో కోరారు. సుదీర్ఘ కాలం తర్వాత 2017లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులు నాటి ప్రభుత్వం నిర్లక్ష్యంతో అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపితే ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఉన్నతాధికారులు సైతం సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీంతో రాష్ట్రంలో ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్లు వంటి దాదాపు వెయ్యి పోస్టుల వరకు పదోన్నతులకు మార్గం సుగమం అవుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ దిశగా ఆలోచన చేయాని కోరారు.

రికార్డ్ గదిని పరిశీలించిన కలెక్టర్



నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు భద్రపరిచే గదిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ రికార్డును భద్రంగా ఉంచాలని తెలిపారు.

క్లుప్తంగా

నేడు 'మహిళా శక్తి సమ్మేళనం'

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 'మహిళా శక్తి సమ్మేళనం' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని విద్య, వైద్య, సామాజిక, ధార్మిక, సేవ, వ్యాపార, వ్యవసాయ పారిశ్రామిక, రాజకీయ, పత్రిక, తదితర రంగాలలో పనిచేస్తున్న మహిళలందరూ ఈ సమ్మేళనంలో పాలుపంచుకోవాలని కోరారు. రెండు విడుతలుగా కొనసాగే ఈ కార్యక్రమంలో మహిళలని చైతన్యం పరచడం, భారతీయ సంస్కృతి, కుటుంబ విలువల పరిరక్షణ, దేశ సమగ్రాభివృద్ధిలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచడం, పలు రంగాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కార మార్గాలను చర్చించడం, మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ముఖ్యలక్ష్యంగా మహిళా శక్తి సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు వివరించారు. రెండు జిల్లాల్లోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలందరూ ఈ సమ్మేళనంలో భాగస్వాములు కావాలని కోరారు.

నలుగురిపై కేసు నమోదు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన గాజుల సాయి, తరుణ్, అజయ్, శ్రావణ్ లక్కారం గ్రామానికి చెందిన సాదని అరవింద్‌కుమార్‌పై పాతకక్షలతో శనివారం దాడి చేశారు. గాయాలపాలైన అరవింద్‌కుమార్‌ను స్థానికులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సఅందించారు. బాధితుని ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బేలలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



కలపను సీజ్ చేస్తున్న అధికారులు

బేల: మండల కేంద్రంలోని పలు వడ్రంగుల ఇళ్లలో జిల్లా అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉన్న రూ.28 వేల విలువైన కలపను సీజ్ చేసినట్లు అటవీ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి వాహబ్ అహ్మద్ తెలిపారు. తనిఖీలు నిర్వహించే సమయంలో అధికారుల విధులకు అడ్డుపడిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీల్లో అధికారులు ఆర్.గులాబ్, పాండురంగ్, సజన్‌లాల్, శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'నిందితుడి తరఫున వాదించొద్దు'



వినతిపత్రం ఇస్తున్న కుటుంబసభ్యులు

ఖానాపూర్: అలేఖ్య హత్యకేసులో నిందితుడు శ్రీ కాంత్ తరఫున న్యాయవాదులెవరూ వాదించవద్దని కోరుతూ కుటుంబ సభ్యులు శనివారం ఖానాపూర్ బార్ అసోసియేషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు. ఈ కేసులో నిందితుడికి న్యాయసాయం అందకుండా సహకరించాలని విన్నవించారు.

నాగోబా జాతర షురూ

- 202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)
- ఉపవాస దీక్ష విరమించిన భేటింగ్ కోడళ్లు
- తరలి వస్తున్న భక్తజనం



జాతరకు తరలి వస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాస్య అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. మొదటి రోజు శనివారం ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. ఈ నెల 15 వరకు అధికారికంగా...మరో రెండు రోజుల పాటు అనధికారికంగా జాతర కొనసాగుతుందని ఈవో రాజమౌళి తెలిపారు

202 మంది కొత్త కోడళ్ల భేటింగ్ (పరిచయం)

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి చేరుకున్నారు. కొత్త కోడళ్లు తెల్లని దుస్తులు ధరించి భేటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 202 మంది కోడళ్లకు మెస్రం వంశ మహిళా పెద్దల సహాయంతో సతీదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. శుక్రవారం రాత్రి ఒంటిగంట నుంచి శనివారం తెల్లవారు జామువరకు భేటింగ్ పూజలు నిర్వహించారు.

ఉపవాస దీక్షలు విరమణ

శుక్రవారం ఉదయం నుంచి కఠోర ఉపవాస దీక్షలతో ఉన్న కొత్త కోడళ్లు శనివారం ఉదయం ఒకరి వెనుక ఒకరు వరుసక్రమంలో మర్రిచెట్టు వద్దగల కోనేరు బావివద్దకు వెళ్లి నీటిని సేకరించారు. ఆ నీటితో గోవడ్ వద్ద దేవతలను శుద్ధిచేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ఉపవాస దీక్షలు విరమించారు.

నాగోబాను దర్శించుకున్న అతిథులు

శుక్రవారం రాత్రి మెస్రం వంశీయుల మహాపూజ అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, ఎస్పీ గౌస్ ఆలం దంపతులు, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు నాగోబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెస్రం వంశీ యులు అతిథులను శాలువాతో సత్కరించి నాగో బా ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశ పటేల్ మెస్రం వెంకట్‌రావ్, పెద్దలు మెస్రం బాదిరావ్, చిన్ను పటేల్, కోసు కటోడ, కోసేరావ్, మెస్రం ఉద్యోగులు మెస్రం దేవ్‌రావ్, మెస్రం మనోహర్, మెస్రం శేఖర్‌బాబు, మెస్రం సోనేరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రవెల్లి: నాగోబా దర్బార్ హాల్‌లో శనివారం రాత్రి ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇంద్రవెల్లి మండలంలోని అంతపూర్, గుడిహత్నూర్ మండలంలోని మచ్చపూర్ కళాకారులు డెంస, గుస్సాడీ నృత్యం చేయడంతో పాటు గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామానికి చెందిన మర్సుకోల కలబాయి బృందం సభ్యులు కిక్రి వాయిస్తూ పాటలు పాడారు.



నాగోబా క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్,కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో ఖుష్బూ గుప్తా, ఎస్పీ గౌస్ ఆలాం



ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా దంపతులకు నాగోబా ప్రతిమ ఇస్తున్న పటేల్ వెంకట్‌రావ్



జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు నాగోబా ప్రతిమను అందిస్తున్న మెస్రం వంశీయులు



గుస్సాడీ నృత్యం చేస్తున్న కళాబృందం సభ్యులు



నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్



భేటింగ్‌కు హాజరైన మెస్రం వంశ కొత్త కోడళ్లు



కోనేరు నుంచి నీటిని సేకరించడానికి వస్తున్న కొత్త కోడళ్లు

'అలేఖ్య హత్యకు పోలీసుల వైఫల్యమే కారణం'

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన అలేఖ్య హత్యకు పోలీసుల వైఫల్యమే కారణమని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి, సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ఆరోపించారు. శనివారం యువతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతికి ఇష్టం లేకున్నా ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధించడంతో పాటు హత్య చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలన్నారు. యువతి పెళ్లి రద్దు చేయించిన విషయం పోలీసుల దృష్టికి వచ్చిన రోజే శ్రీకాంత్ పై కేసు నమోదు చేసి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఉన్మాది చేతిలో యువతి నిండు ప్రాణం పోయిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు చట్టాలను కఠినతరం చేయాలన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సమత, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

జైనథ్: మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దేవల్ల సాయి కుమార్(28), మమత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాయికుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో పంటచేలోనే పురుగుల మందు తాగాడు. ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు.

వివాహిత ఆత్మహత్య

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన లలిత (40) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. మృతురాలు కొంత కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతుండేది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

తాంసి: మండల కేంద్రానికి సమీపంలో శనివారం ఉదయం బైక్, కారు ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. భీంపూర్ మండలంలోని గోన గ్రామానికి చెందిన సతీష్ తన కుమారుడితో కలిసి తాంసికి వెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఘటనలో బైక్ ప్రయాణిస్తున్న ఇరువురికి గాయాలుకాగా రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు సతీష్‌ను హైదరాబాద్‌కు తరలించారు. కారుతో పాటు బైక్‌ను తాంసి పోలీసులు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కదం పరశురాంకు చెందిన ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు, రెవెన్యూ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పరశురాం కుటుంబం శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ ప్రమాదంలో రూ.37వేల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్ఐ జయరాజ్ తెలిపారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. మార్కెట్ ఏరియాలో మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు శనివారం సాయంత్రం దాడి చేసి చౌదరిగల్లికి చెందిన సయ్యద్ జుబేర్ అనే నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. రూ.8,790 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ వైర్ల చోరీ

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గోదావరి తీరంలో గల రైతుల విద్యుత్ మోటార్ల వైర్లను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 14 మంది రైతులకు చెందిన మోటార్లకు అనుసంధానం చేసిన రూ.60 వేల విలువైన వైర్లను ఎత్తుకెళ్లారని రాజేందర్, లక్ష్మీరాజం, చిన్నయ్య, దే వక్క, సంతోశ్, నారాయణ, హరీశ్, కృష్ణమూర్తి, నర్సయ్య, నర్సయ్య, రాజన్న, రమేశ్ తెలిపారు.

వసంత పంచమికి వేళాయె..

- రేపటి నుంచి మూడు రోజులు వేడుకలు
- అక్షరాభ్యాసాల కోసం మూడు మండపాలు
- వంద గదుల టీటీడీ సత్రానికి మరమ్మతులు
- ప్రముఖుల కోసమే ఆలయ గెస్ట్‌హౌస్‌లు
- భక్తులకు ఈయేడూ వసతి కోసం కష్టమే..



బాసర ఆలయం

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 12 నుంచి 14 వరకు మూడు రోజులు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక యేటా ప్రభుత్వం వసంత పంచమి రోజు సరస్వతీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తూ వస్తోంది. గతేడాది వరకు అప్పటి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించేవారు. ఇటీవలే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ బాధ్యతలు చేపట్టారు. ఈయేడు వసంత పంచమి వేడుకలకు రావాలని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ శరత్‌పాఠక్, ఈవో విజయరామారావు, ఆలయ వైదిక బృందం మంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. ప్రముఖులకు సైతం ఆహ్వాన పత్రికలు అందజేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో బాసర అమ్మవారి క్షేత్రంలో వసంత పంచమివేడుకలు జరుగనున్నాయి.

మూడు చోట్ల మండపాలు...

ప్రతీ వసంత పంచమికి బాసరలో అక్షరాభ్యాస పూజలు భారీగా జరుగుతాయి. దివ్య ముహూర్తాన పిల్లలకు అక్షరాభ్యాస పూజలు చేయిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్న విశ్వాసంతో ఏటా దేశవ్యాప్తంగా భక్తులు ఇక్కడికి తరలివస్తున్నారు. ఏటేటా భక్తులు పెరుగుతుండంతో ఈయేడు ఆలయంలో మూడు చోట్ల అక్షరాభ్యాస మండపాలు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో అక్షరాభ్యాసాలు జరిగినా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

ప్రారంభమైన ఏర్పాట్లు....

వసంత పంచమి సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. క్యూలైన్‌ల కోసం కర్రలతో వరుసలు కడుతున్నారు. భారీకేడ్ల నుంచి భక్తులకు అనుమతించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ వసంత పంచమి సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు భద్రత పరమైన ఇబ్బందులులేకుండా చూస్తున్నారు. క్యూలైన్‌ల వద్ద, ఆలయ ప్రధాన ద్వారం వద్ద, గోదావరి నది సమీపంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. భారీగా వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ కేటాయిస్తున్నారు. వసంత పంచమి దృష్ట్యా బాసరలో ప్రసాదాల తయారీపైన సిబ్బంది దృష్టిసారించారు. గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

చేనేత చీర...

బాసరలో అఖిల భారత పద్మశాలీ సంఘం సభ్యులు వసంత పంచమి రోజున అమ్మవారికి సమర్పించేందుకు చీరను నేస్తున్నారు. ఇందుకోసం పద్మశాలీ సంఘ భవనంలో మగ్గం తీసుకువచ్చి అమ్మవారి చీరను ఇక్కడే నేస్తున్నారు. ప్రత్యేకంగా తయారుచేసిన చీరను వసంత పంచమిరోజున అమ్మవారికి సమర్పించనున్నారు. ఇక బాసర రైల్వే స్టేషన్, బస్టాండ్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

వసతికి ఇబ్బందులే...

వసంత పంచమి వేడుకలకు ముందుగా వచ్చే భక్తులకు వసతి ఇబ్బందులు తప్పేలాలేవు. టీటీడీ వంద గదుల సత్రంలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ భక్తులకు గదులు కేటాయించే అవకాశం లేదు. ఆలయానికి వెళ్లేమార్గంలో గెస్ట్‌హౌస్‌లు, ఇతర గదులు ఉన్నాయి. 36 గదులు ఉన్నా వీఐపీల కోసమే అందుబాటులో ఉంచుతున్నారు. పెద్ద సంఖ్యలో వీఐపీలు వచ్చిన గెస్ట్‌హౌస్‌లు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది కూడా భక్తులకు వసతి కష్టాలు తప్పేలా లేవు. సాధారణ భక్తులు ఇప్పటికే ప్రైవేటు లాడ్జీల్లో గదులను తీసుకున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులులేకుండా చూస్తాం. ఈనెల 12 నుంచి 14 వరకు వసంత పంచమి ఉత్సవాలు జరుగుతాయి. ఈనెల 14న బాసర రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను ఆహ్వానించాం. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వసంత పంచమి రోజున మూడు మండపాల్లో అక్షరాభ్యాసాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– విజయరామారావు, ఈవో

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

ఖానాపూర్: హత్యకు గురైన అలేఖ్య కుటుంబాన్ని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నాయకులు శనివారం పరామర్శించారు. నిందితుడికి శిక్షపడే వరకు తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసులు హత్య కేసు విషయంలో యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నైతం శ్రీనివాస్, మూలంకల మురళి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నార్నూర్: జిల్లాలోని లంబాడీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని శనివారం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ నాయకులు ఎస్పీ గౌస్‌ఆలంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్ నాయక్, బానోత్ గజానంద్ నాయక్ మాట్లాడుతూ ఉట్నూర్ పట్టణ కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంక్ పక్కన ఐదు గుంటల స్థలం కేటాయింపు, బేల మండల కేంద్రంలో శ్రీ సంత్ రామారావు మహారాజ్ విగ్రహావిష్కరణకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాదవ్ గోపాలరావు, రాథోడ్ శేష రావు, అమర్ సింగ్ రాథోడ్, సుధాకర్ ఆడే, రాందాస్ నాయక్ నేతావత్, బానోత్ రామారావు, జాదవ్ బలరాం నాయక్, ఆడే సురేష్, జోహార్ నరేష్, బానోత్ జగన్, తదితరులు పాల్గొన్నారు.